

రాములోరి కల్యాణం

జీచుపల్లి కోదండరామస్వామి ఆలయంలో బుధవారం రాములోరి కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు.

-8లో ▸



జూరాలకు భారీగా వరద

జూరాల జలాశయానికి బుధవారం ఎగువ నుంచి భారీగా వరద వచ్చి చేరినట్లు ప్రాజెక్టు అధికారులు వివరించారు.

-8లో ▸

గరిష్టం/కనిష్టం
32.8 /21.3

వాతావరణం

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులే



నాగర్‌కర్నూల్ రూరల్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులేనని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఎగురవేసి మాట్లాడారు. భూమి, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం ఎర్రజెండా నీడలో సాగిందన్నారు. నిజాం నిరంకుశ పాల నకు వ్యతిరేకంగా పోరాడుతూ తెలంగాణ ప్రాంతాన్ని ఎర్రజెండా మయం చేసిన కామ్రేడ్ భీమిరెడ్డి, నర్సింహారెడ్డి, చాకలి ఐలమ్మ, మల్లు స్వరాజ్యం, అరుట్ల కమలాదేవి, దొడ్డి కొమురయ్య వంటి ఎందరో నేతలు అమరులయ్యారని అన్నారు. రైతాంగ సాయుధ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులేనని గుర్తించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.శ్రీనివాసులు, కందికొండ గీత, పొదిల రామయ్య, అశోక్, యాదయ్య, వెంకటేశ్, కాశన్న, సత్యనారాయణ, రవి, మల్లికార్జున్, రాఘవేందర్, కృష్ణయ్య, వెంకటయ్య, బాలస్వామి పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతర కృషి : ఎస్పీ

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసుశాఖ నిరంతరం కృషి చేస్తోందని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అన్నారు. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజల ధన, మాన, ప్రాణాలను రక్షించేందుకు పోలీసు సిబ్బంది 24 గంటలపాటు సంసిద్ధంగా ఉంటున్నట్లు తెలిపారు. సంఘ విద్రోహ శక్తులపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. శాంతిభద్రతల పరంగా ఏమైనా సమస్యలు ఉంటే ప్రజలు నేరుగా పోలీసులను సంప్రదించాలని సూచించారు.

మహిళలు పూర్తి ఆరోగ్యంగా ఉండాలి

నాగర్‌కర్నూల్ క్రైం: మహిళ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం సురక్షితంగా ఉంటుందని.. మహిళల ఆరోగ్య పరిరక్షణకు స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. బుధవారం జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, అచ్చంపేట ఎమ్మెల్యే డా.వంశీకృష్ణతో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంత మహిళలు ఆరోగ్య సంరక్షణ కోసం ఆహారపు అలవాట్లను తప్పనిసరిగా మార్చుకోవాలని సూచించారు. పూర్వం జొన్న, సజ్జ, రాగులు వంటి ఆహార పదార్థాలను ఎక్కువ తీసుకోవడం వల్ల ఎంతో ఆరోగ్యంగా ఉండేవారని గుర్తుచేశారు. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రులు, గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహిస్తారని.. మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ.. ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేస్తోందన్నారు. కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ.. జిల్లాలో నిర్వహించే వైద్యశిబిరాల్లో మహిళలకు ఈఎన్‌టీ, నేత్ర, రక్తపోటు, మధుమేహం, దంత పరీక్షలతో పాటు నోటి, రొమ్ము ఇతర క్యాన్సర్, రక్తహీనత, టెలిమానస్ సేవలు, సికిల్ సెల్ ఎనీమియా తదితర వైద్యపరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.ఉషారాణి, ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ డా.రవికుమార్ పాల్గొన్నారు.

నిండుకుండలా రామన్‌పాడు జలాశయం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో బుధవారం సముద్ర మట్టానికి పైన 1,021 అడుగుల పూర్తిస్థాయి నీటిమట్టం ఉన్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు. జూరాల ఎడమ కాల్వ నుంచి 550 క్యూసెక్కుల వరద జలాశయానికి చేరుతుండగా.. సమాంతర కాల్వలో నీటి సరఫరా లేదన్నారు. జలాశయం నుంచి ఎన్టీఆర్ కాల్వకు 875 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వలకు 55 క్యూసెక్కులు, వివిధ ఎత్తిపోతల పథకాలకు 873 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కులు వినియోగించినట్లు వివరించారు.

నియంతృత్వం నుంచి ప్రజాపాలన దిశగా..

చారిత్రక ఘటనకు గుర్తుగా ప్రభుత్వ కార్యక్రమం

- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పేదలకు ఆత్మగౌరవం
- వ్యవసాయం, విద్య, వైద్యరంగాలపై ప్రత్యేక దృష్టి
- పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేసి పాలమూరును సస్యశ్యామలం చేస్తాం
- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి



కలెక్టరేట్ ప్రాంగణంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, చిత్రంలో కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, ఎమ్మెల్యే వంశీకృష్ణ

సాక్షి, నాగర్‌కర్నూల్: దశాబ్దాల తరబడి ఉద్యమాలు, పోరాటాల చరిత్ర తెలంగాణకు ఉందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి అన్నారు. నాటి నిజాం నిరంకుశ పాలన నుంచి విముక్తి పొంది.. ప్రజాస్వామ్య పాలన అవతరించిన చారిత్రక ఘటనకు గుర్తుగా నేటి తెలంగాణ ప్రభుత్వం ప్రజాపాలన దినోత్సవాన్ని నిర్వహిస్తుందని చెప్పారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన తెలంగాణ ప్రజాపాలన దినోత్సవానికి చిన్నారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలసి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజాం పాలనలో ప్రజలు భూస్వాముల వద్ద బానిసలుగా బతకాల్సిన పరిస్థితులు ఉండేవని గుర్తుచేశారు. దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్య్రం వచ్చినా నిజాం ఏలుబడిలో ఉన్న హైదరాబాద్ సంస్థానానికి మాత్రం విముక్తి కలుగలేదన్నారు. ఆపరేషన్ కాటర్ పిల్లర్, ఆపరేషన్ పోలో పేరుతో భారత ప్రభుత్వం హైదరాబాద్ సంస్థానంపై పోరాటం చేసిన ఫలితంగా 1948 సెప్టెంబర్ 17న భారత యూనియన్‌లో విలీనమైందన్నారు. ఈ చారిత్రక సందర్భాన్ని తమ ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందని చెప్పారు.



సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న తెలకపల్లి కేజీబీవీ విద్యార్థినులు

సామాజిక న్యాయం దిశగా అడుగులు..

రాష్ట్రంలో తమ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ప్రజాపాలన కార్యక్రమం ద్వారా సంక్షేమ పథకాలకు పేదల నుంచి దరఖాస్తులు స్వీకరించామన్నారు. ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుతో పాటు ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డుల పంపిణీ చేపట్టామన్నారు. ప్రజలకు సామాజిక న్యాయం అందించే లక్ష్యంతో తమ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు.

పేదల సొంతింటి కల సాకారం..

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో నిరుపేద కుటుంబాల సొంతింటి కలను నెరవేరుస్తున్నట్టు చెప్పారు. నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున నిర్మించి ఇస్తున్నామన్నారు. జిల్లాలో ఇప్పటివరకు వచ్చిన 2.58 లక్షల దరఖాస్తులకు గాను 56వేల దరఖాస్తుదారులను అర్హులుగా గుర్తించామని తెలిపారు. ఇప్పటికే 11,622 ఇళ్లను కేటాయించి.. 6,599 ఇళ్లకు మార్కింగ్ పూర్తిచేసినట్టు చెప్పారు. తమ ప్రభుత్వం వ్యవసాయానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రైతుభరోసా, రుణమాఫీ, రైతు బీమా పథకాలతో పాటు సన్నరకం వరిధాన్యానికి బోనస్ చెల్లిస్తున్నామని వివరించారు. ఇప్పటి వరకు 14,757 మంది రైతులకు రూ. 39.51 కోట్ల బోనస్ చెల్లించామన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 5లక్షల నుంచి రూ. 10లక్షలకు పెంచామన్నారు.

విద్య, వైద్యరంగాల అభివృద్ధి..

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. జిల్లాలో విద్యార్థులు లేక మూతబడిన 23 పాఠశాలలను తిరిగి ప్రారంభించామని చెప్పారు. 21 పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులను ప్రారంభించామన్నారు.



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న చిన్నారెడ్డి

పెండింగ్ ప్రాజెక్టులపై దృష్టి..

జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టిసారించామని.. పాలమూరు జిల్లాను సస్యశ్యామలం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ఉమ్మడి జిల్లాలో ఒకేసారి నాలుగు ప్రాజెక్టులకు రూ. 7వేల కోట్లు కేటాయించారని గుర్తుచేశారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా 3.7 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతోందన్నారు. ఈ పథకం ద్వారా ఇప్పటివరకు 311.644 టీఎంసీల నీటిని ఎత్తిపోశామని వివరించారు. కేఎల్‌ఐకి అనుసంధానంగా పులిజాల నుంచి చంద్రసాగర్ చెరువు వరకు 15 కి.మీ. బ్రాంచ్ కెనాల్ నిర్మాణం కోసం రూ. 107.20 కోట్లకు పరిపాలనా అనుమతులు ఇచ్చామన్నారు. అచ్చంపేట లిఫ్ట్ ఇరిగేషన్ స్టేజ్–1 కింద తెలకపల్లి, ఉప్పునుంతల, లింగాల, బల్మూర్, అచ్చంపేట మండలాల్లో 57,200 ఎకరాలకు నీరందించేందుకు రూ. 1,534 కోట్ల అంచనాలతో పరిపాలనా అనుమతులు పొందినట్టు వివరించారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను పూర్తిచేసి ఉమ్మడి పాలమూరు జిల్లాను సస్యశ్యామలం చేస్తామన్నారు. కాగా, ప్రజాపాలన వేడుకల్లో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

పాల ఉత్పత్తిలో రాష్ట్రంలోనే రెండోస్థానం..

తెలంగాణ రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ ద్వారా జిల్లాలో రోజుకు 72,716 లీటర్ల పాలను సేకరిస్తున్నామని చెప్పారు. పాల సేకరణలో నాగర్‌కర్నూల్ జిల్లా రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచిందన్నారు. గోవులు, గేదెల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయిల్‌పాం తోటల సాగును ప్రోత్సహిస్తూ.. రైతుల ఆదాయం పెంచేందుకు కృషిచేస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు 200 మంది రైతులతో 753 ఎకరాల్లో ఆయిల్‌పాం తోటలు నాటించామన్నారు.

⇨ జిల్లాలోని 22 పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా తరగతులు బోధిస్తున్నట్టు వివరించారు. విద్యార్థులతో పాటు ప్రభుత్వ ఉపాధ్యాయులకు సైతం ముఖ గుర్తింపు హాజరు వర్తింపజేశామని.. దీంతో ఉపాధ్యాయుల హాజరు శాతం, సమయపాలన మెరుగుపడిందన్నారు. సమగ్ర మహిళా ఆరోగ్య పథకం కింద మహిళలకు 8 రకాల స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే 17,883 మంది మహిళలకు రిజిస్ట్రేషన్ పూర్తయిందని తెలిపారు. రహదారుల విస్తరణకు హైబ్రిడ్ ఆన్యూటీ మోడల్ కింద రూ. 166కోట్ల నిధులతో 16.60 కి.మీ. మేర పనులు మంజూరు చేశామన్నారు.

నిలిచిన ఆరోగ్యశ్రీ సేవలు

- బకాయిలు రూ.కోట్లకు చేరడంతో ప్రైవేటు ఆస్పత్రుల విముఖత
- సేవలు నిలిపివేతతో పేదలకు ఆర్థిక ఇబ్బందులే..
- మొదటి రోజు ఆస్పత్రులకు వచ్చి తిరిగి వెళ్లిన రోగులు?



మహబూబ్‌నగర్ సుశ్రుత ప్రజావైద్యశాల వద్ద ఏర్పాటు చేసిన బ్యానర్

పాలమూరు: పేద రోగులకు సంజీవనిగా పనిచేసే ఆరోగ్యశ్రీ సేవల్లో అంతరాయం ఏర్పడటంతో అవస్థలు తప్పడం లేదు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచితంగా ఓపీ సేవలతోపాటు ఖరీదైన సర్జరీలను పొందుతున్నారు. అయితే ప్రస్తుతం ప్రైవేట్ ఆస్పత్రులకు రావాల్సిన బకాయిలు రూ.కోట్లలో పేరుకుపోవడంతో ఈ సేవలను కొనసాగించడానికి యాజమాన్యాలు విముఖత చూపుతున్నాయి. దీంతో సాధారణ, మధ్య తరగతి రోగుల జేబులకు చిల్లుపడే పరిస్థితి కనిపిస్తోంది.

ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేసిన సర్జరీలు, అంచనా వివరాలు

జిల్లా	చేసిన సర్జరీలు	బకాయిలు (రూ.లలో..)
గద్వాల	527	1,02,78,990
మహబూబ్‌నగర్	19,032	46,95,71,170
నాగర్‌కర్నూల్	133	34,03,362
నారాయణపేట	275	1,02,52,882
వనపర్తి	603	1,94,18,046

ఆస్పత్రుల వద్ద బ్యానర్లు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రైవేట్ ఆస్పత్రుల్లో బుధవారం నుంచి ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేయడం జరిగింది. పాలమూరు పట్టణంలో చాలా ఆస్పత్రులకు రోగులు రాగా సేవలు బంద్ చేసినట్లు సిబ్బంది చెప్పడంతో వెనుదిరిగారు. అన్ని ఆస్పత్రుల ముఖద్వారాల దగ్గర ఆరోగ్యశ్రీ సేవలు బంద్ ఉన్నట్లు నోటీస్ బోర్డులు, బ్యానర్లు ఏర్పాటు చేశారు. గత కొన్ని రోజులుగా ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేస్తున్న ఆరోగ్యశ్రీ కేసులకు సంబంధించిన నిధులు ప్రభుత్వ ఆస్పత్రులకు చెల్లించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకోవడం జరిగింది. ఒక్కో ఆస్పత్రికి రూ.కోట్లలో బకాయిలు ఉండటం వల్ల ఆరోగ్య శ్రీ సేవలు కొనసాగించడం భారంగా మారినట్లు ప్రైవేట్ ఆస్పత్రి యాజమాన్యాలు పేర్కొంటున్నాయి. చివరగా గతేడాది మార్చి నుంచి ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ద్వారా ఆస్పత్రులకు బడ్జెట్ విడుదల కావడం లేదు. దీంతో ఈ విభాగం కింద కేసులను అడ్మిట్ చేసుకోవడంతోపాటు ఓపీ సేవలు అందించడం సవాల్‌గా మారింది. ప్రధానంగా మహబూబ్‌నగర్ పట్టణంలో ఆరోగ్యశ్రీ సేవలు అందిస్తున్న ప్రైవేట్ ఆస్పత్రులు అధికంగా ఉన్నాయి. ఒక్కో ఆస్పత్రికి రూ.5 నుంచి రూ.10 కోట్ల వరకు బకాయిలు ఉన్నట్లు తెలుస్తోంది.

మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్



మాట్లాడుతున్న గువ్వల బాలరాజు

అచ్చంపేట రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత హామీలతో గద్దెనెక్కిందని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. బీఆర్‌ఎస్ నుంచి బీజేపీలో చేరిన తర్వాత మొదటిసారిగా అచ్చంపేటకు వచ్చిన గువ్వల బాలరాజుకు స్థానిక బీజేపీ కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియం నుంచి ప్రధాన రహదారి గుండా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ చౌరస్తాలో వారు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి 420 హామీలతో అధికారంలోకి వచ్చారని విమర్శించారు. మహిళ లు, విద్యార్థులు, ఉద్యోగులు, రైతన్నల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రజాకార్ల పాలనను కాంగ్రెస్ ప్రభు త్వం తలపిస్తుందని అన్నారు. గతంలో తనను ఓడించడానికి బీఆర్‌ఎస్ నాయకులే కుట్రలు చేశార ని గువ్వల ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. కాగా, పట్టణంలో బీజేపీ కార్యకర్తలు పెద్దఎత్తున స్వాగత తోరణాలు, ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. అయితే శాంతిభద్రతల దృష్ట్యా పోలీసులు కార్యకర్తలకు ముందస్తు హెచ్చరికలు చేయడంపై అసహనం వెలిబు చ్చారు. మరోవైపు అంబేడ్కర్ విగ్రహం చుట్టూ బీజేపీ జెండాలు కట్టారని అంబేడ్కర్ సంఘం, దళిత సంఘం, కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరసన వ్యక్తంచేశారు. వారి ఫిర్యాదుతో మున్సిపల్ సిబ్బంది వెంటనే ఆ ప్రాంతంలో బీజేపీ జెండాలు, తోరణాలను తొలగించారు. అయితే ఓర్వలేకనే కుట్ర పూరితంగా కక్షసాధింపు చర్యలు చేపడుతున్నారని బీజేపీ నాయకులు ఆరోపించారు. లింగాల చౌరస్తా లో పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సుధాకర్‌రెడ్డి, నరేందర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, మంగ్యానాయక్, బాలాజీ, రామోజీ, సీతారాంరెడ్డి, మహేందర్, శంకర్ పాల్గొన్నారు.

కొండారెడ్డిపల్లిని ఆదర్శంగా తీర్చిదిద్దుదాం

వంగూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి స్వగ్రామమైన కొండారెడ్డిపల్లిని రాష్ట్రంలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం అచ్చంపేట ఎమ్మెల్యే డా.వంశీకృష్ణతో కలిసి ఆయన కొండారెడ్డిపల్లిలో పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామంలో చేపట్టిన నాలుగు లైన్ల రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, సీసీరోడ్లు, చిల్డ్రన్ పార్కు, జిమ్, పోస్టాఫీస్, యూనియన్ బ్యాంక్, విద్యుద్దీకరణ, మిల్క్ చిల్లింగ్ సెంటర్‌తో పాటు ఇతర అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటిస్తూ వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పనులను పూర్తి చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ.. కొండారెడ్డిపల్లి గ్రామాభివృద్ధి కోసం ఇప్పటికే పెద్ద మొత్తంలో నిధులు మంజూరయ్యాయన్నారు. అవసరమైతే మరిన్ని నిధులు కూడా వస్తాయని.. అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలని సూచించారు. సమావేశంలో గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎనుముల కృష్ణారెడ్డి, గ్రామ ప్రత్యేకాధికారి, అదనపు కలెక్టర్ దేవసహాయం, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్ ఉన్నారు.

'టీఎల్‌ఎం' మేళాకు వేళాయె..

నేడు జిల్లాస్థాయిలో ప్రదర్శన

- దృశ్య, శ్రవణ అనుభూతితో దీర్ఘకాల జ్ఞాపకం
- విద్యార్థుల్లో నేర్చుకోవాలనే ఆసక్తి పెంపుదల
- పాల్గొననున్న 20 మండలాల ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు



ఇటీవల కొల్లాపూర్ మండలంలో నిర్వహించిన టీఎల్‌ఎం మేళాలో ఎల్లూరు పీఎస్ ఉపాధ్యాయులు ప్రదర్శించిన బోధనోపకరణాలు (ఫైల్)

కందనూలు: ప్రభుత్వ బడుల్లో చదువుకుంటున్న చిన్నారుల్లో అక్షర బీజాలు నాటి.. వారిని చదువులో ముందుకు నడిపించేందుకు విద్యాశాఖ వినూత్న పద్ధతులు పాటిస్తోంది. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధించే దిశగా ఉపాధ్యాయులను సన్నద్ధం చేస్తోంది. అందులో భాగంగా మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో టీఎల్‌ఎం (టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్) మేళాలు నిర్వహిస్తోంది. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు వినూత్న బోధనా పద్ధతులు పాటించడం.. పాఠ్యాంశాలు సులభంగా అర్థమయ్యే విధంగా బోధించడం టీఎల్‌ఎం దోహదపడుతుంది.

1 నుంచి 5వ తరగతి వరకు..

జిల్లావ్యాప్తంగా గత నెలలో 1నుంచి 5వ తరగతి వరకు మండలస్థాయిలో టీఎల్‌ఎం మేళా నిర్వహించారు. మొత్తం 20 మండలాల్లో ఎంపికైన ఉత్తమ టీఎల్‌ఎంలను గురువారం జిల్లా కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో నిర్వహించే జిల్లాస్థాయి మేళాలో ప్రదర్శించనున్నారు. ఇందులో భాషా పాఠాలు, అక్షరమాల, పద బంధాలు, కథాచిత్రాలు, గణితం, సంఖ్యా మోడళ్లు, ఆకారాలు, కొలతలు, గణన పద్ధతులు, పర్యావరణం, జంతువులు, పక్షులు, రుతువులు, చారిత్రక స్మారకాలు, సంప్రదాయాలు, సైన్స్ ప్రయోగాలు తదిత ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలను ఉపాధ్యాయులు రూపొందించిన టీఎల్‌ఎంలలో జోడించి ప్రదర్శించనున్నారు. వీటి ద్వారా విద్యార్థులకు నేర్చుకోవాలని ఆసక్తి పెరగడంతో పాటు దృశ్య అనుభూతి కలుగుతుంది. టీఎల్‌ఎం తయారీతో ఉపాధ్యాయుల అంతర్గత ప్రతిభ కూడా బయటకు వస్తుందని విద్యాశాఖ అభిప్రాయపడుతోంది.

సులువుగా అర్థమయ్యేలా..

బోధన ప్రక్రియను సులభతరం చేసి.. విద్యార్థులకు పాఠ్యాంశాలపై ఆసక్తి పెంపొందించేందుకు ఉపయోగపడే ప్రతి వస్తువు, వనరు, పరికరం బోధన అభ్యసన సామగ్రిగా చెప్పవచ్చు. ఈ తరహా బోధనలో ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య జరిగే బోధన అభ్యసన ప్రక్రియ మెరుగుపడుతుంది. వీటి ద్వారా ఉపాధ్యాయుడు బోధనను అత్యంత ప్రభావవంతంగా నిర్వహించవచ్చు. విద్యార్థులు కూడా చురుగ్గా నేర్చుకుంటారు. అభ్యసన ప్రక్రియ మరింత సులభతరం అవుతుంది. ఉపాధ్యాయుల బోధన విద్యార్థులకు ఎక్కువ కాలం గుర్తుంటుంది. విద్యార్థుల్లో ఆలోచన, విమర్శనాత్మక శక్తి పెరుగుతుంది. దృశ్య, శ్రవణ సాధనాలను టీఎల్‌ఎం బోధనలో ఉపయోగిస్తారు.

జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు: 497	
ప్రాథమికోన్నత: 124	విద్యార్థులు: 26,203

ఎంపిక ఇలా..

ప్రతి ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు రూపొందించిన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌ను మండల స్థాయిలో ఎంఈఓ పర్యవేక్షణలో ప్రదర్శించారు. ఎన్‌సీఈఆర్టీ సూచించిన మార్గదర్శకాల ప్రకారం ప్రతి మండల స్థాయిలోని పది ఉత్తమ టీఎల్‌ఎంలను జిల్లాస్థాయికి ఎంపిక చేశారు. వీటిలో తెలుగు, ఆంగ్లం, గణితం, పరిసరాల విజ్ఞానం అంశాల్లో రెండేసి.. అన్నింటిలో ఉత్తమంగా ఉన్న మరో రెండేసి చొప్పున ఉండాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇందుకు మండల స్థాయిలో ముగ్గురు స్థానిక విద్యా నిపుణులతో కూడిన జ్యూరీని నియమించారు. జిల్లా స్థాయిలో డీఈఓ ఆధ్వర్యంలో ఆరుగురు నిపుణుల జ్యూరీ కమిటీ అగ్రభాగాన నిలిచిన ఎనిమిది ఉత్తమ టీఎల్‌ఎంలను రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపిక చేస్తారు.

అభ్యసన సామర్థ్యాలు పెంపు..



మండల స్థాయిలో టీఎల్‌ఎం మేళాను పూర్తిచేశాం. జిల్లాస్థాయిలో నిర్వహించే టీఎల్‌ఎం మేళాకు ప్రతి మండలం నుంచి ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు తప్పక హాజరు కావాలి. దీన్ని ద్వారా విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలు పెంపొందించే అవకాశం ఉంటుంది. వినూత్న బోధనలతో విద్యార్థులను ఆకట్టుకోవచ్చు.

– రమేశ్‌కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి

మెరుగైన ఫలితాలే లక్ష్యం..

ప్రభుత్వ పాఠశాలల్లో 90 శాతంపైగా పేద విద్యార్థులే చదువుతుంటారు. వీరి తల్లిదండ్రులకు విద్యాభ్యాసం అంతంత మాత్రమే. ఈ నేపథ్యంలో కనీస సామర్థ్యాలు పెంపొందించేందుకు టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ మంచి ఫలితాలు ఇస్తోంది. ఈ విధానంలో తొలుత 45 నిమిషాల పాటు ఉపాధ్యాయుడు పాఠాన్ని బోధిస్తాడు. ఆ తర్వాత పాఠ్యాంశానికి సంబంధించిన సామగ్రిని ప్రదర్శించి.. విద్యార్థులతో అభ్యసనం చేయిస్తారు. దీంతో విద్యార్థులు వేగవంతంగా నేర్చుకునే అవకాశం ఉంటుందని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

క్లుప్తంగా

చికెన్ కర్రీలో బల్లి కలకలం

నాగర్‌కర్నూల్ క్రైం: కస్టమర్లు ఆర్డర్ చేసిన చికెన్ కర్రీలో మృతిచెందిన బల్లి కనిపించిన ఘటన జిల్లాకేంద్రంలోని నెల్లికొండ చౌరస్తాలోని ఓ దాబాలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. దాబాలో చికెన్ కర్రీ, రైస్ ఆర్డర్ చేయడంతో దాబా సిబ్బంది కస్టమర్‌కు చికెన్ కర్రీ తీసుకొచ్చి ఇచ్చాడు. అందులో చనిపోయిన బల్లి కనబడడంతో భయాందోళనకు గురయ్యాడు. చికెన్ కర్రీలో చనిపోయిన బల్లి కస్టమర్లకు ఇచ్చిన ఘటన సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. ఘటనకు సంబంధించి ఫుడ్ ఇన్స్‌పెక్టర్ నీలిమను వివరణ కోరగా.. ఎలాంటి ఫిర్యాదు అందలేదని, విచారణ చేస్తామని తెలిపారు.

గంజాయి పట్టివేత: ఇద్దరి రిమాండ్



జడ్చర్ల: స్కూటీలో గంజాయిని తరలిస్తుండగా ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టుకుని ఇద్దరి వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జడ్చర్ల ఎక్సైజ్ ఎస్‌ఐ కార్తీక్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మంగళవారం రాత్రి జడ్చర్ల కొత్తబస్టాండ్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా స్కూటీపై వస్తున్న ఇద్దరు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని తనిఖీ చేయగా స్కూటీ డిక్కీలో 310గ్రాముల ఎండు గంజాయి బయటపడింది. గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. వీరిలో ఒకరిని జడ్చర్ల కుమ్మరివాడకు చెందిన కుమార్ అలియాస్ మింటుగా గుర్తించగా.. మరొకరు బీహార్‌కు చెందిన బిజేశ్‌కుమార్‌గా గుర్తించారు. వీరు హైదరాబాద్‌లో రూ.15వేలకు ఆరకిలో గంజాయిని కొనుగోలు చేసి 10 గ్రాముల ప్యాకెట్ చొప్పున తయారు చేసి ఒక్కో ప్యాకెట్‌ను రూ.600కు విక్రయిస్తున్నారు. స్కూటీతోపాటు రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని బుధవారం నిందితులను రిమాండ్‌కు తరలించారు. తనిఖీలో సిబ్బంది అనిల్, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య



ఈరమ్మ(ఫైల్)

కేటీదొడ్డి: ఉరేసుకుని యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని ఉమిత్యాలతండాలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. తండాకు చెందిన ఈరమ్మ (19) మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు బుధవారం ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. యువతికి మద్దెలబండతండాకు చెందిన ఓ వ్యక్తితో వివాహం నిశ్చయమైంది. తరచూ ఫోన్‌లో మాట్లాడేదన్నారు. తల్లి దేవమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



రాజాపూర్(బాలానగర్): బాలానగర్ మండలం మోతీఘణపూర్ శివారులో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్‌ఐ లెనిన్‌గౌడ్ తెలిపారు. మోతీఘణపూర్ శివారులో సీఎస్‌కే వెంచర్‌లో 45 సంవత్సరాల వ్యక్తి మృతదేహాన్ని గ్రామస్తులు చూసి సమాచారం ఇచ్చారని పేర్కొన్నారు. మృతుడి ఒంటిపై బ్లూ షార్ట్, తెల్లషర్టుపై గీతలున్నట్లు మృతుడి జేబులో గార్డ్ శ్యామ్‌శర్మ ఐడీ నెంబర్ 00689 ఐడీకార్డు ఉన్నట్లు తెలిపారు. మోతీఘణపూర్ పంచాయతీ కార్యదర్శి వడ్ల నరేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని జడ్చర్ల ఆస్పత్రి మార్చురీకి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

అచ్చంపేట రూరల్: పట్టణంలోని టంగాపూర్ శివారులో ఓ వెంచర్‌లో తాను కొనుగోలు చేసిన ప్లాట్‌లో ఇంటి నిర్మాణం చేయగా.. కొందరు ఆక్రమణదారులు కూల్చివేశారని మనస్తాపం చెందిన పుల్యానాయక్ అనే వ్యక్తి బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. పట్టణంలోని సర్వే నెంబర్ 26, 27లో కొన్నేళ్ల కిందట ప్లాట్లను కొనుగోలు చేశాడు. మున్సిపల్ అధికారుల నుంచి ఇంటి నిర్మాణానికి అనుమతి తీసుకున్నప్పటికీ కొందరు ఆక్రమణదారులు తమ ప్లాట్లను బలవంతంగా లాక్కుంటున్నారని ఆరోపించారు. బుధవారం జేసీబీ సహాయంతో నిర్మాణ దశలో ఉన్న గోడలు, రేకులు తొలగించడంతో మనస్తాపంతో పురుగుల మందు తాగాడు. గమనించిన సమీప ఇళ్లవారు అచ్చంపేట ఆస్పత్రికి తరలించారు.



యథావిధిగా సెర్చ్ ఆపరేషన్



హమీద్‌ను సన్మానిస్తున్న జిల్లా అటవీశాఖ అధికారి సత్యనారాయణ

- మరిన్ని చిరుతలు ఉండొచ్చనే అనుమానం
- 16 ట్రాప్, 4 లైవ్ కెమెరాలతో నిఘా, 3 బోన్ల ఏర్పాటు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: కనిపించిందొకటి, బోనుకు చిక్కిందొకటి అనే అనుమానాలు స్థానిక ప్రజలను వెంటాడుతుండటంతో అటవీశాఖ చిరుత పులుల సంచారంపై మరింత అప్రమత్తమైంది. మహబూబ్‌నగర్ పట్టణ సమీపంలోని వీరన్నగట్టు, తిర్మల్‌దేవునిగుట్ట, డంపింగ్ యార్డు ప్రాంతాల్లో అటవీ సిబ్బందిని మూడు షిఫ్టులుగా విభజించి షిఫ్టుకు ఐదుగురు బృందంతో 24 గంటలు నిఘా ఉంచారు. రెండున్నర నెలలుగా పట్టణ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న చిరుతపులి ఈనెల 15న వీరన్నపేట సమీపంలో తిర్మల్‌దేవుని గుట్ట వద్ద బోనుకు చిక్కింది. బోనుకు చిక్కిన చిరుతపులి రెండు సంవత్సరాల్లోపు వయసు కలిగినదిగా, ఆడపులిగా హైదరాబాద్‌లోని నెహ్రూ జూలాజికల్ పార్క్‌లో నిపుణులైన వెటర్నరీ డాక్టర్లు గుర్తించారు. అయితే రెండున్నర నెలలుగా గుట్టపై ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరాల్లో రికార్డయిన పులి పగ్ మార్కులను గుర్తించిన స్థానిక అటవీశాఖ అధికారులు మగపులిగా, దాదాపు 3నుంచి 4ఏళ్ల కలిగినదిగా పేర్కొన్నారు. బోనుకు చిక్కిన చిరుత పులి, ట్రాప్ కెమెరాల్లో రికార్డయిన చిరుతపులికి వ్యత్యాసాలను అంచనా వేసిన స్థానికులు మరిన్ని చిరుతపులులు ఉండొచ్చనే భయాందోళన నెలకొంది. ఈ క్రమంలో అటవీశాఖ అధికారులు మరింత అప్రమత్తమై సెర్చ్ ఆపరేషన్‌ను కొనసాగిస్తూనే ఉన్నారు.

సహకరించిన హమీద్‌కు సన్మానం, నగదు బహుమతి

మహబూబ్‌నగర్ పట్టణ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న చిరుత పులిని బోనుకు చిక్కేలా అటవీ సిబ్బందితోపాటు సహకరించిన వీరన్నపేటకు చెందిన హమీద్‌ను జిల్లా అటవీశాఖ అధికారి సత్యనారాయణ ఘనంగా సన్మానించారు. మయూరి పార్కులో బుధవారం అధికారులు, సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో హమీద్‌ను సన్మానించి రూ.5వేల నగదు బహుమతిని అందజేశారు. రెండున్నర నెలలుగా వీరన్నగట్టు, తిర్మల్‌దేవుని గుట్ట, డంపింగ్ యార్డు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బోన్‌ల్లో మేకలను ఉంచడం, అటవీ సిబ్బందితోపా టు ఉన్నతాధికారులను గుట్టపైకి దారిచూపి తీసుకెళ్లడం, ఎప్పటికప్పుడు బోన్‌లపై ని ఘా పెట్టడం వంటి చర్యల్లో చురుకుగా పాల్గొన్నందు కు హమీద్ సేవలను గుర్తిస్తూ అటవీశాఖ సత్కరించింది.

జూరాలకు మళ్లీ భారీగా వరద



జూరాల జలాశయం నుంచి దిగువకు పారుతున్న వరద

- 20 క్రస్ట్ గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

ధరూరు/ఆత్మకూర్/రాజోళి: ప్రియదర్శిని జూరాల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద బుధవారం భారీగా పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. మంగళవారం 1,18,500 క్యూసెక్కులు ఉండగా.. బుధవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో 1.73 లక్షల క్యూసెక్కులకు చేరిందన్నారు. దీంతో ప్రాజెక్టు 20 క్రస్ట్ గేట్లను పైకెత్తి 1,42,180 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నామన్నారు. విద్యుదుద్పత్తి నిమిత్తం 34,879 క్యూసెక్కులు, నెట్టెంపాడుకు 750, ఆవిరి రూపంలో 47, భీమా లిఫ్ట్–1కు 650, ఎడమ కాల్వకు 1,030, కుడి కాల్వకు 600, భీమా లిఫ్ట్–2కు 750 క్యూసెక్కులు వినియోగించినట్లు వివరించారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 9.070 టీఎంసీలు ఉందన్నారు.

కొనసాగుతున్న విద్యుదుత్పత్తి..

జూరాల దిగువ, ఎగువ జల విద్యుదుత్పత్తి కేంద్రాల్లో విద్యుదుత్పత్తి కొనసాగుతోందని ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. బుధవారం ఎగువ 6 యూనిట్ల నుంచి 234 మెగావాట్లు, 338.100 మి.యూ., దిగువ 6 యూనిట్ల నుంచి 240 మెగావాట్లు, 362.935 మి.యూ. విద్యుదుత్పత్తి చేపట్టామని వివరించారు. రెండు కేంద్రాల్లో ఇప్పటి వరకు 701.035 మి.యూ. విజయవంతంగా పూర్తి చేసినట్లు చెప్పారు.

సుంకేసులకు 30 వేల క్యూసెక్కులు..

సుంకేసుల జలాశయానికి ఎగువ నుంచి స్వల్పంగా వరద వస్తున్నట్లు జేఈ మహేంద్ర తెలిపారు. బుధవారం 30,450 క్యూసెక్కుల వరద రాగా.. ఆరు గేట్లను మీటరు మేర తెరిచి 26,472 క్యూసెక్కులు దిగువకు, కేసీ కెనాల్‌కు 2,445 క్యూసెక్కులు వదిలినట్లు వివరించారు.

అధిక వడ్డీ ఆశచూపి రూ.7కోట్ల టోకరా

- అండమాన్‌లో నిందితుల అరెస్టు
- రిమాండ్‌కు తరలింపు

నాగర్‌కర్నూల్ క్రైం: అధిక వడ్డీ ఆశచూపి రూ.ఏడుకోట్లకుపైగా నగదు వసూలు చేసి పరారైన నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ బుధవారం తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ మండలంలోని గుడిపల్లికి చెందిన రిటైర్డ్ సీఆర్‌పీఎఫ్ జవాన్ మాసయ్య హైదరాబాద్‌లో ఓ బ్యాంకులో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తుండేవాడు. మాసయ్యకు అండమాన్ నికోబార్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా పనిచేస్తున్న రోహణ్, ఆదిల్ పరిచయమయ్యారు. వీరిని సాఫ్ట్‌వేర్ ఉద్యోగం నుంచి తొలగించడంతో గ్రోలాండ్ పేరిట ఓ కంపెనీ పెట్టి అండమాన్ నికోబార్‌లో కాఫీ తోటల్లో పెట్టుబడులు పెడితే రూ.లక్షకు నెలకు రూ.25వేలు వడ్డీ వస్తుందని నమ్మించారు. దీంతో అతడు తన వద్ద ఉన్న రూ.కోటికిపైగా నగదును వారికి ఇవ్వడమే కాకుండా ఏజెంట్‌గా వ్యవహరించి మరికొందరిని చేర్పించారు. కొద్దిరోజులు క్రమం తప్పకుండా నెలవారీగా వడ్డీ డబ్బులు చెల్లిస్తుండడంతో 50మందికిపైగా రూ.కోట్లకుపైగా నగదు పెట్టుబడిగా పెట్టారు. రోహణ్, ఆదిల్ నకిలీ కంపెనీని మూసేసి నగదుతో పరారుకావడంతో మోసపోయినట్లు గుర్తించి మాసయ్య ఈ ఏడాది మే 7న స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ఆదేశాలతో ఒక ప్రత్యేక టీంను ఏర్పాటు చేసి అండమాన్ నికోబార్‌కు వెళ్లి సోమవారం రాత్రి నిందితులు రోహణ్, ఆదిల్‌తోపాటు వారికి సహకరించిన రాము, ఆలీని అరెస్టు చేసి మంగళవారం కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు.

గర్భిణికి అరుదైన శస్త్రచికిత్స



యాదమ్మను పరామర్శిస్తున్న జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్, వైద్యులు

- ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడిన వైద్యసిబ్బంది
- 12 రోజులుగా ప్రత్యేక గైనకాలజీ విభాగంలో వైద్యచికిత్సలు

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రాణాపాయస్థితిలో ఉన్న గర్భిణికి జనరల్ ఆస్పత్రి గైనకాలజీ విభాగం వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించి ప్రాణాలు పాకాడడంతోపాటు సురక్షితంగా బుధవారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ ఉషారాణి కథనం ప్రకారం.. తాడూరు మండలం చర్ల తిరుమలాపూర్‌కు చెందిన గర్భిణి యాద మ్మ ఈనెల 6న తీవ్ర రక్తస్రావం కావడంతో అపస్మారస్థితిలోకి వెళ్లింది. కుటుంబ సభ్యులు జిల్లాకేంద్రంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులకు తిరిగినా గర్భిణి పరిస్థితి గమనించి చికిత్స అందించకపోవడంతో కుటుంబ సభ్యులు జనరల్ ఆస్పత్రిలో చేర్పించారు. పల్స్, బీపీ పూర్తిగా పడిపోయిన స్థితిలో చేరిన గర్భిణి యాదమ్మను గైనకాలజిస్టులు పరీక్షించి హెటిరోటోపిక్ ప్రెగ్నెన్సీ గర్భధారణగా స్కానింగ్ చేసి నిర్ధారించారు. పిండం గర్భసంచి పక్కనున్న ట్యూబ్‌లో పెరగడం, అది పగిలిపోయి అధిక రక్తస్రావం జరిగినట్లు గుర్తించి వెంటనే గర్భిణి రక్తంలోకి 4 ఎర్ర రక్త కణాలు, 3 తెల్ల రక్త కణాలు ప్యాకెడ్ సేల్స్‌ను బ్లడ్‌బ్యాంక్ ద్వారా ఎక్కించి గైనకాలజీ విభాగం హెచ్‌ఓడీ ప్రొఫెసర్ డాక్టర్ నీలిమ ఆధ్వర్యంలో శస్త్ర చికిత్స చేసి గర్భిణి ప్రాణా లు రక్షించారు. ఎటరోటోపిక్ ప్రెగ్నెన్సీ చాలా అరుదని, లక్ష మంది గర్భిణుల్లో ఒకరికి సంభవించే అవకాశం ఉంటుందని తెలిపారు. మరో రెండురోజుల తర్వా త గర్భసంచిలో ఉన్న పిండం కూడా గుండెచప్పుడు లేకపోవడంతో మ్యానువల్ వాక్యూమ్ ఆస్పిరేషన్ ద్వారా చికిత్స అందించినట్లు తెలిపారు. 12రోజులుగా యాదమ్మను ప్రత్యేక గైనకాలజీ విభాగంలో ఉంచి వైద్యచికిత్సలు అందించడంతోపాటు బుధవారం క్షేమంగా ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేసి అంబులెన్స్‌లో ఇంటికి పంపినట్లు తెలిపారు. ప్రాణాపా య స్థితిలో వచ్చిన గర్భిణికి మెరుగైన చికిత్స అందించిన వైద్యసిబ్బందిని సూపరింటెండెంట్ అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ శేఖర్, స్త్రీ వైద్య నిపుణులు నీలిమ, సుప్రియ, సౌమ్య, శిరీష, అనస్తీశియా బృందం ధీరజ్, గౌతం, సురేశ్, ఉదయ్, నర్సింగ్ ఆఫీసర్ జరీనా పాల్గొన్నారు.

జ్వరం వచ్చిందని వస్తే.. కుక్కకాటు ఇంజెక్షన్ ఇచ్చారు



నాగరాజు

దేవరకద్ర: జ్వరంతో బాధపడుతున్న ఓ వ్యక్తి చికిత్స కోసం ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చాడు. అక్కడ పరీక్షించిన వైద్యుడు చీటీ రాసివ్వగా.. దానిని నర్సుకు చూపించడంతో ఆమె నిర్లక్ష్యంగా కుక్కకాటు ఇంజక్షన్ ఇచ్చిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర పీహెచ్‌సీలో చో టుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. దేవరకద్ర మున్సిపాలిటీ పరిధిలో ని బల్సుపల్లి గ్రామానికి చెందిన నాగరాజు వైర ల్ జ్వరంతో బాధపడుతూ సోమవారం దేవరకద్ర పీహెచ్‌సీకి వచ్చాడు. అయితే మూడు రోజుల పాటు ఐవీ పెట్టాలని, అందులో ఇంజక్షన్ ఇ వ్వాలని సూచిస్తూ వైద్యాధికారి శరత్‌చంద్ర ప్రిస్కిప్షన్ ఇవ్వగా.. సెలైన్ పెట్టి ఇంజెక్షన్ చేశా రు. మంగళవారం అదే చీటీని తీసుకువచ్చి వై ద్యాధికారికి చూపించగా మళ్లీ ఐవీ పెట్టాలని సూచించారు. అయితే ఆస్పత్రిలో ఉన్న ఏఎన్ఎం విజయకుమారి వద్దకు వెళ్లిన నాగరాజు చీటీ చూపించగా వరుసగా తేదీలు ఉండడంతో కుక్కకాటు ఇంజెక్షన్ ఇవ్వాలని అనుకున్న నర్సు యాంటీ రేబిస్ టీకా చేసింది. ఐవీలో ఇవ్వాల్సిన ఇంజక్షన్ ఇలా చేతికి ఇవ్వడంతో బాధితుడు నాగరాజు నర్సును అడిగాడు. కుక్కకాటు ఇంజక్షన్ ఇచ్చినట్లు నర్సు చెప్పడంతో ఆందోళనకు గురైన బాధితుడు విషయం వైద్యాధికారి శరత్‌కు చెప్పగా.. నర్సుపై చర్యలు తీసుకుంటా మని పేర్కొన్నారు. కాగా.. కొందరు ఇంట్లోక్కలను పెంచుకునే వారు ముందస్తుగా యాంటీ రేబిస్ టీకాలు తీసుకుంటారని, దీని వల్ల ఎలాంటి ప్రమాదం ఉండదని వైద్యాధికారి చెప్పారు. అయితే నాగరాజును మాత్రం అబ్జర్వేషన్‌లో ఉంచుతామని తెలిపారు. ఈ క్రమంలోనే బుధవారం మరోసారి నాగరాజుకు వైద్య పరీక్షలు చేసి జ్వరానికి సంబంధించిన ఇంజక్షన్ ఇచ్చారు.

వ్యక్తి ఆత్మహత్య

వెల్దండ: మండలంలోని బొల్లంపల్లికి చెందిన కానుగుల జంగయ్య(45) బుధవారం వ్యవసాయ పొలంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు కథనం ప్రకారం.. జంగయ్య వెల్దండలో వెల్డింగ్ షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం షాపు వద్దకు వెళ్తున్నట్లు ఇంట్లో నుంచి వెళ్లాడు. మధ్యాహ్నం ఫోన్ చేసినా ఎత్తకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. వ్యవసాయ పొలంలో సాయంత్రం 6గంటలకు బైక్ ఉండడంతో పరిసరాల్లో వెతకగా.. చెట్టుకు ఉరేసుకొని మృతిచెందాడు. మృతిగల కారణాలు తెలియరాలేదు. మృతుడికి భార్య రజితతోపాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

అడవిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

మహబూబ్‌నగర్ క్రైం: దాదాపు పదిరోజుల కిందట చెట్టుకు ఉరేసుకొన్న ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రూరల్ ఎస్‌ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని అప్పన్నపల్లి అడవిలో గుర్తు తెలియని వ్యక్తి(35) దాదాపు పదిరోజుల కిందట చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. బుధవారం మేకల కాపరి సమాచారం మేరకు ఘటనా స్థలాన్ని సందర్శించి మృతదేహం పరిశీలించగా.. పూర్తిగా గుర్తించలేని విధంగా కుళ్లిపోయింది. మృతదేహం జనరల్ ఆస్పత్రిలోని పోస్టుమార్టం గదికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

యాచకుడి హత్య కేసులో నేరస్తుడికి జీవిత ఖైదు

మహబూబ్‌నగర్ క్రైం: యాచకుడిని రాళ్లతో దాడి చేసి హత్య చేసిన కేసులో నేరస్తుడికి శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. దేవరకద్ర పోలీస్ స్టేషన్ పరిధిలో 2024 ఏప్రిల్ 18న స్థానిక బస్టాండ్ వద్ద ఆర్‌వోబీ బ్రిడ్జి కింద ఉంటూ బిక్షాటన చేసే మరికల్‌కు చెందిన సీమ వెంకటయ్యను రాళ్లతో దాడిచేసి హత్య చేశారు. ఈ కేసు బుధవారం అదనపు సెషన్స్ కోర్టు–ఎస్సీ, ఎస్టీ కోర్టుకు రావడంతో వాదనలు విన్న తర్వా త నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి శారదాదేవి నిందితుడు వెంకటేశ్‌కు జీవిత ఖైదుతోపాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. కేసు దర్యాప్తు, విచారణలో కృషి చేసిన పోలీస్ అధికారులు, సిబ్బంది, అదనపు పీపీని ఎస్పీ జానకి అభినందించారు.

రమణీయం.. రాములోరి కల్యాణం



బీచుపల్లిలో సీతారాములకు కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

ఎర్రవల్లి: శ్రీరాముని జన్మనక్షత్రమైన పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని కోదండరామస్వామి ఆలయంలో బుధవారం సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు సీతారాములను అపురూపంగా ముస్తాబు చేసి వేద మంత్రాల నడుమ కల్యాణం రమణీయంగా జరిపించారు. కల్యాణ కార్యక్రమాన్ని తిలకించేందుకు ఆలయ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. భక్తులు ఉదయాన్నే బీచుపల్లికి చేరుకొని పవిత్ర కష్టానదిలో పుణ్యస్నానాలను ఆచరించి భక్తిశ్రద్ధలతో సీతారాముల కల్యాణంలో పాల్గొని కనులారా తిలకించారు. కల్యాణానికి హాజరైన భక్తులకు ఆలయ పాలక మండలి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించా రు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ సురేందర్‌రా జు, అర్చకులు భువనచంద్ర, దత్తుస్వామి, భానుమూర్తి, పాలక మండలి సభ్యులు, భక్తులు, పాల్గొన్నారు.

గంజాయి మొక్కలు స్వాధీనం?

గట్టు: మండలంలోని బోయలగూడెం గ్రామ శివారులో బుధవారం పోలీసులు గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. అయిజ మండల తొత్తినోనిదొడ్డి గ్రామానికి చెందిన ఓ రైతు బోయలగూడెం గ్రామ శివారులోని పొలాన్ని కౌలుకు తీసుకుని అందులో పత్తి పంట సాగు చేశాడు. అయితే పత్తి పంటలో అంతర్ పంటగా గంజాయి మొక్కలను కూడా పెంచుకున్నాడు. విషయం పోలీసుల దృష్టికి వెళ్లడంతో సదరు రైతు సాగు చేసిన పొలాన్ని పరిశీలించి, 7 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. అయితే కేసు నమోదుకు సంబంధించిన వివరాలను పోలీసులు వెల్లడించలేదు.

విద్యుదాఘాతంతో ఇద్దరు రైతుల మృతి



రాచూరి స్వామి (ఫైల్)



భద్రునాయక్(ఫైల్)

ఖిల్లాఘనపురం: పంటకు కాపలా కాసేందుకు పొలం వద్దకు వెళ్లి విద్యుదాఘాతానికి గురై రైతు మృతిచెందిన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకోగా.. ఆలస్యంగా బుధవారం వెలుగు చూ సింది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఖిల్లాఘనపురం మండలంలోని రోడ్డుమీది తండాకు చెందిన సభావత్ భద్రునాయక్ (భద్యానాయక్) తాను సాగు చేసుకున్న వరిపంటను అడవి పందుల బెడద నుంచి కాపాడుకునేందుకు విద్యుత్ షాక్ పెట్టాడు. సోమవారం రాత్రి భోజనం తర్వాత కాపలాకు పొలం వద్దకు వెళ్లాడు. విద్యుత్ వైర్లు గమనించక ప్రమాదవశాత్తు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మంగళవారం ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల వారు ఫోన్ చేశారు. ఫోన్‌రింగ్ అవుతున్నా.. ఎత్తడంలేదు. ఎక్కడో వెళ్లి ఉంటాడని అనుకున్నారు. మంగళవారం సాయంత్రం వరకు చూశారు. ఎంతకూ రాకపోవడంతో పొలానికి వెళ్లి చూడగా.. కరెంట్‌షాక్‌తో మృతిచెంది ఉన్నాడు. వెంటనే తండాకు తరలించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. బుధవారం మృతుడి కూతురు కాట్రావత్ గీత ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్ తెలిపారు.

కోడేరు: విద్యుదాఘాతంతో రైతు మృతిచెందిన ఘటన మండలంలోని తీగలపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. రాచూరిస్వామి(45) తన పొలంలో మోటారు వేసేందుకు వెళ్లగా విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. స్వామి ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెంది పొలానికి వెళ్లి చూడ గా మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జగదీశ్వర్ తెలిపారు. మృతుడికి భార్య నాగమ్మ, ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుర్లున్నారు.

పొట్టేలు కోసం వెళ్తూ.. మృత్యు ఒడిలోకి

- ఆటోను ఢీకొట్టిన లారీ: భర్త, మరోవ్యక్తి దుర్మరణం
- భార్యకు గాయాలు, ఆస్పత్రికి తరలింపు
- ఆర్తనాదాలతో మార్మోగిన ఆస్పత్రి పరిసరాలు




రవి (ఫైల్)



రాజు(ఫైల్)

వనపర్తి రూరల్: పెద్దల పండుగ కోసం బంధువుల వద్ద పొట్టేలును తీసుకొచ్చేందుకు వెళ్తూ మృత్యు ఒడికి చేరిన ఘటన వనపర్తి మండలం నాచహళ్లి వద్ద బుధవారం చోటుచేసుకుంది. ఆటోను లారీ ఢీకొట్టిన ఘటనలో భర్త, మరోవ్యక్తి దుర్మరణం చెందగా.. భార్యకు గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. వనపర్తి మండలం నాచహళ్లికి చెందిన పాలెమోని రవి(35) కూరగాయల వ్యాపారి. పెద్దల పండుగ ఉండడంతో పెబ్బేరులోని బంధువుల వద్ద పొట్టేలును తీసుకొచ్చేందుకు భార్య సరోజ, వనపర్తిలోని పీర్లగుట్ట తిరుమలకాలనీకి చెందిన పెబ్బేటి తెలుగురాజు(38)తో కలిసి బుధవారం మధ్యాహ్నం నాచహళ్లి నుంచి ఆటోలో బయలుదేరారు. మార్గమధ్యంలో లిరిక్స్ రైస్‌మిల్లు వద్ద పెబ్బేరు నుంచి అతివేగంగా వస్తున్న లారీ ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో నుజ్జునుజ్జయి రవి, రాజు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. సరోజ ఆటోలోంచి కిందపడిపోవడంతో గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ జలంధర్‌రెడ్డి సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను వనపర్తి ఆస్పత్రి మార్చురీ, క్షతగాత్రురాలిని ఆస్పత్రికి తరలించారు. ఆయా గ్రామాల్లో విషాదఛాయలు అమలుకున్నాయి. మృతుల బంధువులు, ,గ్రామస్తులు ఆస్పత్రి వద్దకు చేరుకోవడంతో పరిసరాలు ఆర్తనాదాలతో నిండిపోవడంతో పలువురిని కంటతడి పెట్టించాయి.

26 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



మహిమూద్ దుకాణంలో పట్టుబడ్డ రేషన్ బియ్యం

మద్దూరు: మద్దూరు పట్టణంలో ఓషాపులో పీడీఎస్ బియ్యం ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించి బియ్యాన్ని పట్టుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఆనంద్ కథనం ప్రకారం.. పట్టణంలోని ఎస్‌బీఐ దగ్గర ఉన్న దుకాణంలో పీడీఎస్ బియ్యం ఉన్నట్లు సమాచారం మేరకు నారాయణపేట, కోస్గి ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు కాశప్ప, భాస్కర్‌తో కలిసి తనిఖీలు నిర్వహించగా.. అక్కడ 58 బస్తాల బియ్యాన్ని గుర్తించారు. అలాగే రెండో ఆటోల్లో పీడీఎస్ బియ్యాన్ని అక్కడ అమ్మడానికి తీసుకొచ్చారు. ఒక ఆటోలో రెండు బస్తాలు, మరో ఆటోలో 6 బస్తాల బియ్యం ఉన్నట్లు గుర్తించారు. ఈ మొత్తం 66 బస్తాల బియ్యాన్ని తూకం వేయగా.. 26 క్వింటాళ్లు వచ్చాయి. వీటిని ఖాజీపూర్ డీలర్ శ్రీలతకు అప్పగించి రషీద్ తీసుకున్నారు. దుకాణ యజమాని మహిమూద్, ఆటో డ్రైవర్లు గోవిందు, నరేశ్‌పై కేసు నమోదు చేసి ఆటోలను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు డీటీ పేర్కొన్నారు.

వేధింపులు భరించలేక మహిళ ఆత్మహత్యాయత్నం

గోపాల్‌పేట: ఫైనాన్స్ అధికారుల వేధింపులు భరించలేక ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికుల కథనం ప్రకారం.. గోపాల్‌పేట మండల కేంద్రంలోని చంద్రాయునిగడ్డ కాలనీకి చెందిన అలివేలు వనపర్తికి చెందిన ఓ ఫైనాన్స్ కంపెనీలో ఆరుగురు మహిళలు కలిసి రూ.40వేల చొప్పున లోన్ తీసుకున్నారు. ఇంట్లో పరిస్థితులు బాగోలేక కొన్నిరోజులుగా ఫైనాన్స్ కిస్తులు కట్టలేదు. దీంతో బుధవారం ఫైనాన్స్ కంపెనీ అధికారులు ఇంటికి వచ్చి నాలుగు గంటలపాటు తప్పకుండా కట్టాల్సిందేనని ఇల్లు తాళం వేస్తామని భీష్మించుకు కూర్చున్నారు. రూ.4వేలు కట్టాల్సి ఉండగా.. 2వేలు చెల్లించింది. ఎప్పుడూ లేనిది ఫైనాన్స్ వాళ్లు ఇంటికి వచ్చి గొడవలు చేస్తున్నారని భర్త మందలించాడు. దీంతో మనస్తాపానికి గురై ఎవరూ చూడకుండా ఇంట్లోకి వెళ్లి ద్రావణం తాగింది. వెంటనే వాంతులు చేసుకుని స్పృహతప్పి పడిపోయింది. కుటుంబ సభ్యులు గుర్తించి వెంటనే వనపర్తి ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అలివేలు పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

వికసించిన బ్రహ్మకమలం



మక్తల్‌లో మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి నివాసంలో బ్రహ్మకమలం మొక్కకు బ్రహ్మకమలం పుష్పం వికసించింది. దీంతో బుధవారం ఆయన సతీమణి, మక్తల్ వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ గవినోళ్ల రాధమ్మ పూజలు నిర్వహించారు. బ్రహ్మకమలం అరుదుగా కనిపించే పువ్వు కావడంతో ఇరుగుపొరుగు వారు చూసి ఆనందం వ్యక్తం చేశారు.

– మక్తల్